
సాక్షి పెద్దపల్లి

శుక్రవారం । 10 । ఫిబ్రవరి । 2023



పత్తి ధర రూ.7,662

పెద్దపల్లిరూరల్: మార్కెట్‌యార్డులో క్వింటాలు పత్తిధర రూ.7,662గా నమోదైంది. కనిష్టధర రూ.7వేలు, సరాసరి ధర రూ.7,575గా పలికింది. 1077 క్వింటాళ్లు విక్రయించారు.



రెస్క్యూ పోటీలు ఇక్కడే..

జాతీయస్థాయిలో జరిగే రెస్క్యూ పోటీలు ఈసారి సింగరేణి పరిధిలో నిర్వహించేలా ఏర్పాట్లు చేస్తున్నారు. 8లో▸

గరిష్టం/కనిష్టం 33.0/16.0

వాతావరణం

వాతావరణం పొడిగా ఉంటుంది. గాలిలో తేమశాతం తగ్గుతుంది. పగలు ఎండగా ఉంటుంది.

న్యూస్‌రీల్

2ఏ బ్రిడ్జి విస్తరణ పనులు ఏమయ్యాయి



డివిజన్‌లో పర్యటిస్తున్న ఎంఎస్‌రాజ్‌ఠాగూర్

గోదావరిఖని: ఎమ్మెల్యే చందర్ ఇచ్చిన జీడీకే–2ఏ బ్రిడ్జి విస్తరణ హామీ ఏమైందని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు ఎంఎస్ రాజ్‌ఠాగూర్ ప్రశ్నించారు. గురువారం హాథ్‌సేహాథ్ జోడో అభియాన్ యాత్రలో భాగంగా రామగుండం పరిధిలోని 28,30డివిజన్‌లో పర్యటించారు. ప్రతీ వర్షాకాలం ఈ ప్రాంత ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నా పట్టించుకోవడం లేదన్నారు. ఇంటిటా తిరుగుతూ ప్రజా సమస్యలు తెలుసుకున్నారు. రాష్ట్ర ప్రభుత్వం రూ.లక్ష వరకు రైతు రుణమాఫీ చేస్తామని హామీఇచ్చి విఫలమైందని అన్నారు. రామగుండం అభివృద్ధిపథంలో ముందుకుసాగాలంటే కాంగ్రెస్ పార్టీకే పట్టం కట్టాలని కోరారు. నాయకులు కాల్వ లింగస్వామి, వీరగోని మహేశ్‌గౌడ్, గాధం విజయానంద్, ఎండీ.ముస్తఫా, పెద్దెల్లి తేజస్విప్రకాష్, బొమ్మక రాజేశ్, వీరబోయిన రవియాదవ్, గట్ల రమేశ్ పాల్గొన్నారు.

బీసీ రిజర్వేషన్ల పెంపుపై నిర్లక్ష్యమెందుకు?



రిలేదీక్ష శిబిరంలో బీఎస్పీ, ఆప్ నాయకులు

పెద్దపల్లిరూరల్: జనాభా ప్రాతిపదికన బీసీల రిజర్వేషన్లు పెంచుకునేందుకు భారత రాజ్యాంగం రాష్ట్ర ప్రభుత్వానికి అధికారమిచ్చినా పెంపుపై పాలకులు ఎందుకు నిర్లక్ష్యం చేస్తున్నారని బీఎస్పీ రాష్ట్ర ప్రధానకార్యదర్శి నిషాని రాంచంద్రం ప్రశ్నించారు. బీసీగణన చేపట్టి, రిజర్వేషన్లు 52 శాతానికి పెంచాలని డిమాండ్ చేస్తూ బీఎస్పీ నియోజకవర్గ ఇన్‌చార్జి దాసరి ఉష ఆధ్వర్యంలో 15 రోజులుగా సాగుతున్న రిలే దీక్షల శిబిరాన్ని గురువారం సందర్శించి మాట్లాడారు. ఛత్తీస్‌ఘడ్, తమిళనాడు, జార్ఖండ్ రాష్ట్రాల్లో బీసీ రిజర్వేషన్లు పెంచిన రీతినే తెలంగాణలోనూ పెంచాలని డిమాండ్‌చేశారు. నల్లాల శ్రీనివాస్, బాలకిషన్, సాధిక్, అఖిల, అజయ్, శేషాద్రి, బాబు, రాజు, కళ్యాణ్, సవిత, ఆప్ నాయకులు బూడిద తిరుపతి, డిగంబర్ పాల్గొన్నారు.

అసెంబ్లీలో బీసీల సీట్ల సంఖ్య పెంచాలి

సుల్తానాబాద్: రాష్ట్రంలో సాధారణఎన్నికల్లో వెనుకబడిన తరగతులకు చెందిన వారికి అసెంబ్లీ, పార్లమెంటుస్థానాల్లో ఎక్కువశాతం భాగస్వామ్యం కల్పించాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం నాయకుడు ఆకుల స్వామి వివేక పటేల్ ఆధ్వర్యంలో కేంద్ర సామాజిక న్యాయ శాఖ మంత్రి రామ్ దాస్ అతవాలే, బీఆర్ఎస్ రాజ్యసభ సభ్యుడు కేశవరావుకు గురువారం ఢిల్లీలో వినతిపత్రం అందించారు. బీసీల్లో సామాజిక చైతన్యం పెరుగుతోందని, చట్టసభల్లో కొట్లాడేందుకు అన్ని పార్టీలపై ఒత్తిడి పెంచుతున్నామని వివరించారు. వచ్చే సాధారణఎన్నికల్లో అసెంబ్లీస్థానాలు పెంచకపోతే ఆయాపార్టీలకు మనుగడ ఉండదని పేర్కొన్నారు. జాతీయస్థాయిలో బీసీల ప్రాతినిధ్యం పెంచేదిశలో ఢిల్లీకేంద్రంగా 16రాజకీయ పార్టీల భాగస్వామ్యంతో జంతర్‌మంతర్ వద్ద ఆర్.కృష్ణయ్య నేతృత్వంలో ధర్నా నిర్వహిస్తామని తెలిపారు. జాతీయ బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు తాడూరి శ్రీమన్నారాయణ, కట్ల నరేంద్రచారి, ఎం.శ్రీనివాస్‌గౌడ్, సాగర్, శ్రీనివాస్, సంతోశ్, అనిల్ ఉన్నారు.

ఎంపిక చేసినవారికే ఇండ్లు కేటాయించాలి

కోల్‌సిటీ: రామగుండం మండలానికి సంబంధించి డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ 2016లోనే పూర్తయ్యిందని, ఏడేళ్లుగా లబ్ధిదారులు ఎదురు చూస్తున్నారని, వారికే ఇళ్లను కేటాయించేలా అధికారులు న్యాయం చేయాలని రామగుండం నగరపాలక సంస్థ మాజీ మేయర్ కొంకటి లక్ష్మీనారాయణ కోరారు.ఈ మేరకు గురువారం జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. ప్రభుత్వం జారీ చేసిన ఆదేశాల ప్రకారం డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల కేటాయింపుకు అప్పటి జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ దరఖాస్తులు ఆహ్వానించారని, రామగుండం పరిధిలో అర్హులను గుర్తించి, 2016 మే 16న డ్రా తీసి రామగుండం పట్టణ ప్రాంతానికి 240 మంది, గ్రామీణ ప్రాంతానికి 160 మందిని ఎంపిక చేసినట్లు గుర్తు చేశారు. వారికే ఇప్పుడు ఇండ్లు ఇవ్వాలని కోరారు. ఇటీవల రామగుండం తహసీల్దార్ ప్రకటన జారీచేయడంతో లబ్ధిదారులు ఆందోళన చెందుతున్నారని వెల్లడించారు.

గల్లీ పోరలు.. గంజాయి ప్రియులు!





పాతబజార్‌లో అనుమానాస్పద యువకులు









యువతకు పార్ట్ టైం జాబ్‌గా మారిన గంజాయి సరఫరా

- కరీంనగర్ పాతబజార్‌లో దాదాపు 20 మందికిపైగా డ్రగ్స్ పెడ్లర్లు
- పాకెట్‌మనీ కోసం విద్యార్థుల అడ్డదారులు
- జగిత్యాల, పెద్దపల్లి, సిరిసిల్లలో చాపకింద నీరులా దందా
- సోషల్ మీడియా వేదికగా గంజాయి కొంటున్న యువత
- ఉత్తరాంధ్ర, భద్రాచలం నుంచి కిలోల కొద్దీ అక్రమ రవాణా
- ప్రైవేటు హాస్టళ్ల గదుల్లోనే గంజాయి ప్యాకింగ్
- యంత్రాలన్నీ ఆన్‌లైన్‌లోనే ఆర్డర్ చేసుకుంటున్న వైనం

‘ఇటీవల కరీంనగర్ తెలంగాణ చౌక్ సమీపంలోని వీధుల్లో గంజాయి విక్రయిస్తున్న ఓ హాస్టల్‌కు చెందిన ఇంటర్, డిగ్రీ విద్యార్థులను పోలీసులు పట్టుకున్నారు. వారి గదుల నుంచి కిలో గంజాయి, కొన్ని వస్తువులను స్వాధీనం చేసుకున్నారు. అందులో చిన్న గ్రైండర్, వెయింగ్ మెషిన్, సిగరెట్ పేపర్, ప్యాకింగ్ పేపర్ తదితరాలు లభ్యమయ్యాయి. వాటిని చూసి పోలీసులే అవాక్కయ్యారు. ఇతర ప్రాంతాల నుంచి కిలోల లెక్కన కొనుగోలు చేసిన గంజాయిని గ్రాముల్లోకి మార్చి విక్రయిస్తున్నట్లు గుర్తించారు. దీనిపై పోలీసులు తీవ్రంగా స్పందించారు. వారి తల్లిదండ్రులను పిలిపించి కౌన్సెలింగ్ చేసి పంపారు. అందులో రిపీటెడ్ అఫెండర్స్ (పదే పదే నేరాలు చేసేవారు)ని మాత్రం రిమాండ్‌కు తరలించారు.’

సాక్షి ప్రతినిధి, కరీంనగర్: సాధారణంగా ఒకప్పుడు గంజాయిని ఇతర రాష్ట్రాలకు చెందిన కూలీలు ఉత్తరాది నుంచి తీసుకువచ్చేవారు. కానీ, కరోనా తరువాత వర్షాలు విస్తారంగా కురుస్తున్నాయి. ఫలితంగా భద్రాచలం, ఛత్తీస్‌ఘడ్, ఉత్తరాంధ్ర ఏజెన్సీ ఏరియాల్లో గంజాయి సాగు పెరిగింది. ఈ పరిణామం రెండు రాష్ట్రాల్లో గంజాయి అక్రమ రవాణా పెరుగుదలకు కారణమైంది. దీన్ని వినియోగించుకుని అనతికాలంలో ఎదిగేందుకు కరీంనగర్ పాతబజార్ ఏరియాలోని కొందరు యువకులు సిద్ధపడ్డారు. ఒకరిని చూసి ఒకరు దాదాపు 20 మంది వరకు ఇక్కడ పెడ్లర్లుగా మారినట్లు సమాచారం. వీరంతా భద్రాచలం ఏరియా నుంచి ఐదారు కిలోల వరకు బైకుల మీద వెళ్లి కొంటారు. కిలోకు రూ.మూడు వేల వరకు వెచ్చించి.. తరువాత వాటిని 50 గ్రాముల పాకెట్లలోకి మార్చి రూ.300 నుంచి రూ.700 వరకు విక్రయిస్తున్నారు. ఒకసారి సరుకు తీసుకొచ్చి.. నెలలో రూ.లక్షల్లో సంపాదిస్తున్నారు. వీరు తయారు చేసే సిగరెట్లకు ఇక్కడ బాగా డిమాండ్ ఉంది. సాధారణంగా మెట్రో నగరాల్లో హషీష్ (గంజాయి నుంచి తీసే నూనె)ను సిగరెట్లలో నింపి వాడతారు. కానీ.. ఇక్కడ విద్యార్థులు ప్రత్యేక పేపర్‌తో సిగరెట్లు తయారు చేసి విక్రయిస్తున్నారు.

విలాసాల కోసమే.. అడ్డదారులు..!

నగరంలో గంజాయి సరఫరా చేసే ఓ యువకుడిని ఎందుకు ఇలా చేస్తున్నావని ప్రశ్నించినప్పుడు తనకు గంజాయి అలవాటు లేదని.. కేవలం స్మార్ట్‌ఫోన్ మెయింటనెన్స్.. తన గర్ల్‌ఫ్రెండ్‌ను బైకు మీద తిప్పేందుకు పాకెట్ మనీ కోసం ఇలా చేశానని.. ఇంకెప్పుడూ ఇలా చేయనని కాళ్లావేళ్లా పడటం చూసి పోలీసులు అవాక్కయ్యారు. ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన కూలీలు, కొందరు డ్రైవర్లు కూడా ఇదే బాటపట్టారు. కేవలం తక్కువ కాలంలో ఎక్కువ సంపాదించవచ్చన్న కారణంతోనే వీరంతా ఇలా గంజాయి స్మగ్లర్ల అవతారమెత్తుతున్నారని పోలీసులే చెబుతున్నారు.

- పాత బజార్‌తోపాటు, కొందరు విద్యార్థులు బైకుల మీదనే వరంగల్ మీదుగా భద్రాచలం వెళ్లి సరుకు తెస్తున్నారని సమాచారం. తిరిగి వచ్చాక.. హాస్టల్ గదుల్లో తమ వద్ద ఉన్న గ్రైండర్‌తో గంజాయి ఆకులను నూరుతున్నారు. ఆ చూర్ణాన్ని వెయింగ్ మెషిన్‌తో 50 లేదా 100 గ్రాముల ప్యాకెట్లలో నింపుతారు. అనంతరం గమ్‌పేపర్లతో సిగరెట్లుగా చుడుతున్నారు.
- వీరు వాడే గ్రైండర్, గమ్‌పేపర్, వెయింగ్ మెషిన్ మొత్తం ఆన్‌లైన్‌లోనే ఆర్డర్ చేసుకున్నట్లు తెలుసుకున్న పోలీసులు ముక్కున వేలేసుకున్నారు.
- గంజాయి విక్రయం అంత ఆషామాషీ కాదు. కేవలం నమ్మకస్తులకే అమ్మాల్సి ఉంటుంది. అందుకే అమ్మే ముందు ఇన్‌స్టా, వాట్సాప్ ద్వారా లొకేషన్లు షేర్ చేసుకుంటున్నారు.
- కరీంనగర్ ఎడ్యుకేషన్ హబ్‌గా ఉంది. ఇక్కడ అనేక ప్రైవేటు, ప్రభుత్వ విద్యా సంస్థలు ఉన్నాయి. కోచింగ్ సెంటర్లతో యువత నిరంతరం హాస్టళ్లలో ఉంటున్నారు. వీరందరినీ పాత బజార్‌కు చెందిన పెడ్లర్లు లక్ష్యంగా చేసుకుంటున్నారు.
- పాత బజార్ ఎంతగా ప్రాచుర్యం పొందిందంటే.. గంజాయి కొనేందుకు జగిత్యాల, పెద్దపల్లి, సిరిసిల్ల జిల్లాల నుంచి విద్యార్థులు వీరిని ఆశ్రయిస్తున్నారంటే అతిశయోక్తి కాదు. వీరితోపాటు గంజాయి పెడ్లర్లుగా మారిన వారిలో జగిత్యాల, సిరిసిల్ల, పెద్దపల్లి నుంచి ఉన్నత విద్యకోసం వచ్చిన విద్యార్థులు కూడా ఉండటం గమనార్హం.
- జగిత్యాల, పెద్దపల్లి నుంచి కూడా పెద్ద ఎత్తున గంజాయి రవాణా జరుగుతోంది. గతవారం జగిత్యాల్లో పోలీసులు అంబులెన్స్‌లో రాజస్తాన్‌కు తరలిస్తున్న 70 కిలోల గంజాయిని పట్టుకున్న సంగతి తెలిసిందే. ఇక ఛత్తీస్‌ఘడ్, మహారాష్ట్రలకు సమీపంలో ఉన్న రామగుండం కమిషరేట్‌లోనూ గంజాయి గుప్పుమంటూనే ఉంది. ఇతర రాష్ట్రాల కూలీల ద్వారా రామగుండంలోకి వస్తున్నప్పటికీ... స్థానికులు కూడా వ్యసనానికి బానిసవడం ఆందోళన కలిగిస్తోంది.



జగిత్యాలలో పోలీసులు పట్టుకున్న గంజాయి (ఫైల్)

గంజాయిపై ఉక్కుపాదం: సుబ్బారాయుడు, సీపీ, కరీంనగర్



నగరంలో గంజాయి విక్రయించేవారిపై ప్రత్యేక దృష్టి సారించాం. నగరంలోని అన్ని పోలీస్‌స్టేషన్ల వారీగా విక్రయదారులను గుర్తించి, నిరంతరం నిఘా పెడుతున్నాం. కమిషనరేట్ పరిధిలో గంజాయి విక్రయించినా, సేవించినా కేసులు నమోదు చేస్తాం. అంతేకాకుండా విద్యాసంస్థలతో కలిసి విద్యార్థులకు అవగాహన సదస్సులు నిర్వహించనున్నాం. ఇలాంటి కేసుల్లో ఇరుక్కుంటే ప్రైవేటు జాబులు కూడా రావన్న సంగతి విద్యార్థులు గుర్తించాలి.

2022లో నమోదైన గంజాయి కేసులు

జిల్లా	కేసులు	పట్టుబడిన గంజాయి	నిందితుల సంఖ్య
కరీంనగర్	22	33.919 కిలోలు	59
సిరిసిల్ల	15	3.509 కిలోలు	51
జగిత్యాల	11	17.620 కిలోలు	32
రామగుండం	13	8.32 కిలోలు	20

మనిషి మృగమైపోతాడు: డాక్టర్ వీరేందర్, సైకాలజిస్ట్



గంజాయికి అలవాటు పడినవారు మృగాలవుతారు. మెదడులో అనేక మార్పులు వస్తాయి. గంజాయి కోసం తహతహలాడతారు. గంజాయి కొనేందుకు చోరీలు, నేరాలకు పాల్పడతారు. వారికి వావీవరసలు ఉండవు. ఆడవాళ్లు ఒంటరిగా దొరికితే ఎలాంటి అఘాయిత్యానికైనా పాల్పడతారు. హింసాత్మక ప్రవృత్తి పెరిగిపోతుంది. దాడులు చేసేందుకు వెనకాడరు. తల్లిదండ్రుల ప్రవర్తనలో తేడాలు కనిపిస్తే.. వెంటనే అప్రమత్తమవాలి. హాస్టళ్లలో చదువుకునే పిల్లలపైనా ఎప్పటికప్పుడు కన్నేసి ఉంచాలి. మెమొరీలాస్, నిద్రలేమీ, అంతర్గత అవయవాలు దెబ్బతిని త్వరగా మరణిస్తారు.

ప్రజల ఆశీస్సులతో మంథని అభివృద్ధి

- ‘సాక్షి’ ఫోన్‌ఇన్‌లో మున్సిపల్ చైర్‌పర్సన్ పుట్ట శైలజ



మంథని: ‘మేజర్ గ్రామపంచాయతీ నుంచి మున్సిపాలిటీగా మారిన మంథని అభివృద్ధిలో ప్రజల దీవెనలు మెండుగా ఉన్నాయి. ప్రజల మమేకంతోనే పట్టణాన్ని రాష్ట్రంలోనే ఆదర్శంగా తీర్చిదిద్దుతున్నాం’ అని మంథని మున్సిపల్ చైర్‌పర్సన్ పుట్ట శైలజ పేర్కొన్నారు. మంథని మున్సిపాలిటీ పాలకవర్గం ఏర్పడి మూడేళ్లు పూర్తయిన సందర్భంగా ‘సాక్షి’ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన ఫోన్‌ఇన్ కార్యక్రమంలో ప్రజలు అడిగిన పలు ప్రశ్నలకు సమాధానం ఇచ్చారు.

ప్రశ్న: అంబేద్కర్‌నగర్‌లో పొద్దంతకూడా వీధిదీపాలు వెలుగుతున్నాయి. ఏం చర్యలు తీసుకుంటారు?

– వేల్పులశ్రావణ్, అంబేద్కర్‌నగర్

చైర్‌పర్సన్: విద్యుత్ వీధిదీపాలను ఉదయం, సాయంత్రం వేళ ఆన్,ఆఫ్ చేసేందుకు సిబ్బంది పనిచేస్తున్నారు.కాలనీలో విద్యుత్ దీపాలు అమర్చుతున్న కారణంగా పరిశీలన నిమిత్తం వెలుగుతున్నాయి. మరోసారి ఇలా జరగకుండా చర్యలు తీసుకుంటాం.

ప్రశ్న: గంగాపురిలో ఇండ్లమధ్య మురుగుతో దోమలు వ్యాప్తి చెందుతున్నాయి.

– పుల్లె కృష్ణ, గంగాపురి

చైర్‌పర్సన్: మార్కెట్ ఆఫీసు నుంచి గంగాపురి వరకు ఉన్న మురుగుగుంతలను గుర్తించాం. ఖాళీస్థలాల యజమానులకు ఇప్పటికే నోటీసులు జారీ చేశాం. చుట్టు ప్రహరీ నిర్మించుకోవాలని సూచించాం. సమస్య త్వరలోనే పరిష్కరిస్తాం.

ప్రశ్న: రోడ్డును పూర్తి చేయించండి

– ఆకుల రమేశ్, 2వ వార్డు

చైర్‌పర్సన్: కొమురోజు సుగుణ ఇంటి నుంచి గుర్రాలవాడ వరకు నూతనంగా రోడ్డు మంజూరైంది. పనులు త్వరగా పూర్తి చేయిస్తాం. అభివృద్ధి పనులకు సహకరిస్తున్నందుకు అందరికీ కృతజ్ఞతలు.

ప్రశ్న: గాంధీచౌక్ ఏరియాలో ఓపెన్‌జిమ్ ఏర్పాటు చేయండి

– రావికంటి రేణుక, గాంధీచౌక్

చైర్‌పర్సన్: గాంధీచౌక్ ఏరియాలో మహిళా భవనం సమీపంలో ఓపెన్ జిమ్ ఏర్పాటుకు సన్నాహాలు జరుగుతున్నాయి. మున్సిపాలిటీలో ఇందుకు తీర్మాణం చేశాం. మీ అందరి సహకారంలో మరింత అభివృద్ధిని సాధిస్తాం.

ప్రశ్న: ప్రధానచౌరస్తా నుంచి గాంధీచౌక్ వరకు ట్రాఫిక్ సమస్యను తీర్చండి

– లోకేరాము, పెంజేరుకట్ట

చైర్‌పర్సన్: వాహనాలు ఎక్కడపడితే అక్కడ నిలుపవద్దని పలుమార్లు మున్సిపల్ మైక్‌ల ద్వారా ప్రజలను కోరుతున్నాం. మరోమారు పోలీసులు, వ్యాపారులతో సమావేశమై సమస్య పరిష్కారానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటాం.

ప్రశ్న: దొంతులవాడలో రోడ్డు నిర్మించండి

– దొంతుల ఓం ప్రకాశ్, దొంతులవాడ

చైర్‌పర్సన్: నూతనంగా మంజూరైన నిధుల ద్వారా పట్టణంలో మిగిలిన రోడ్లను నిర్మిస్తున్నాం. దొంతులవాడ రోడ్డును త్వరలోనే పూర్తిచేసేలా చర్యలు తీసుకుంటాం.

ప్రశ్న: బొక్కలవాగును ట్యాంకుబండ్ తరహాలో తీర్చిదిద్దండి

– బిజ్జంకి దిగంబర్

చైర్‌పర్సన్: బొక్కలవాగును ట్యాంకుబండ్‌కు దీటుగా తీర్చిదద్దేలా ప్రణాళిక సిద్ధం చేశాం. జిల్లా పరిషత్ చైర్మన్ పుట్టమధు సహకారంతో ఆ దిశగా పనులు చేపట్టాం. జాతీయ జెండా ఏర్పాటుకు ప్రయత్నాలు చేస్తాం. పట్టణంలో కుక్కల బెడద నివాణకు చర్యలు తీసుకుంటాం.

మేడారం సాక్షిగా అసమ్మతి రాగం!



సుల్తానాబాద్ మున్సిపాలిటీ

- సుల్తానాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్‌కు అవిశ్వాసం ముప్పు
- ఎమ్మెల్యే దగ్గరికి చేరిన పంచాయితీ
- పట్టించుకోకపోవడం, ఆర్థిక ప్రయోజనాలే కారణం

సాక్షి, పెద్దపల్లి: జిల్లాలోని సుల్తానాబాద్ మున్సిపాలిటీలో అసమ్మతి రాగం వినిపిస్తోంది. స్థానిక బీఆర్ఎస్ కౌన్సిలర్లు చైర్‌పర్సన్‌కు వ్యతిరేకంగా మేడారంలో మినీ సమ్మక్క జాతర సందర్భంగా విందు సమావేశం ఏర్పాటుచేసుకుని గురువారం సాయంత్రం ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డిని కలవడం జిల్లాలో రాజకీయంగా చర్చనీయాంశంగా మారింది. చైర్‌పర్సన్, ఆమె భర్త వ్యవహారశైలిపై అసంతృప్తితో అధికార పార్టీ కౌన్సిలర్లు ఉన్నట్లు తెలుస్తోంది.

వ్యతిరేకంగా మెజారిటీ కౌన్సిలర్లు

సుల్తానాబాద్ మున్సిపాలిటీలో 15మంది కౌన్సిలర్లు ఉండగా, 9 మంది బీఆర్ఎస్, ఆరుగురు కాంగ్రెస్ నుంచి ఎన్నికయ్యారు. అందులో ఒక కౌన్సిలర్ సిద్ధ కనకయ్య అనారోగ్యంతో ఇటీవల మృతి చెందారు. అధికార పార్టీకి చెందిన మెజారిటీ కౌన్సి లర్లు మున్సిపల్ చైర్‌పర్సన్‌గా ముత్యం సునీత కా కుండా ఎవరైనా ఫర్వాలేదని సమ్మక్క–సారలమ్మ మినీ మేడారం జాతరలో ఏకభిప్రాయానికి వచ్చిన ట్లు సమాచారం. వారే గురువారం ఎమ్మెల్యే దాసరితో సమావేశమై, మున్సిపల్ చైర్‌పర్సన్ భర్త ముత్యం రమేశ్ ఒంటెద్దుపోకడతో మిగితా కౌన్సిలర్లుకు కనీస మర్యాదలు ఇవ్వడం లేదని ఫిర్యాదు చేసినట్లు సమాచారం. సుల్తానాబాద్ మేజర్ గ్రామపంచాయతీ పాలకవర్గంలో పనిచేసిన వార్డుసభ్యులకు మూడు నెలలకు ఒకసారి విందులు ఏర్పాటు చేయడమే కాకుండా ఆత్మీయంగా మాట్లాడే వాళ్లని, ఆ పద్ధతి నేడు లేదని చెప్పడం విశేషం. ఒకరికి ఒకరిని కలవనివ్వకుండా ఎవరికి వారితోనే చర్చించి పంపిస్తున్నారు తప్ప అందరిని కలుపుకొని వెళ్లడం లేదని ఫిర్యాదు చేశారు. ఆమెను తప్పించి కౌన్సిలర్లలో పారుపల్లి జ్ఞానేశ్వరి, బిరుదు సమతి, గాజుల లక్ష్మి, పసిడ్ల మమత పేర్లలో ఎవరికి చైర్‌పర్సన్ పదవిని ఇచ్చిన మద్దతు తెలుపుతామని ఎమ్మెల్యేకు చెప్పినట్లు సమాచారం. అన్నీ విన్న తర్వాత ఎమ్మెల్యే ఏ నిర్ణయం చెప్పకుండా దాటవేశారు. దీంతో సదరు నేతలు బయటకు ఎమ్మెల్యే నిర్ణయమే ఫైనల్ అని చెప్పుతున్నా, రాబోయే రోజుల్లో ఏమి జరుగుతుందోనన్నది రాజకీయంగా చర్చనీయాంశంగా మారింది. కాగా.. గతేడాది ఆగస్టులో కౌన్సిలర్ ఫోరం పేరున కమిటీని ఏర్పాటు చేసి అధ్యక్షుడిగా కూకట్ల గోపి, కార్యదర్శిగా గుర్రాల శ్రీనివాస్‌ని ఎన్నుకున్నారు. అప్పటినుంచే అవిశ్వాసంపై ఫోరం ఆధ్వర్యంలో కసరత్తు ప్రారంభించినట్లు ప్రచారం జరుగుతోంది.


కౌన్సిలర్ పై ఎస్సీ ఎస్టీ కేసు కారణమా?

పట్టణంలో కొందరు ఎస్సీలకు 20ఏళ్లక్రితం ప్రభుత్వం లావణి పట్టా ఇచ్చింది. ఆ భూమి పొందిన వ్యక్తి ఇటీవల ఓ కౌన్సిలర్‌కు విక్రయించాడు. ఆ భూమిలో అనుమతులు లేకుండా నిర్మాణాలు చేపట్టాడని మిగితా కౌన్సిలర్లు కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. ఆ భూమి యజమాని తన భూమిలోకి వచ్చి దూషించాడని కౌన్సిలర్‌పై ఫిర్యాదు, చైర్మన్ ఆదేశాలతో సదరు కౌన్సిలర్‌పై ఎస్సీ,ఎస్టీ కేసు నమోదైంది. అప్పుడే అసమ్మతి సెగ అంటుకుంది.

వేచిచూసే ధోరణిలో కాంగ్రెస్

కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్లు మాత్రం తటస్థంగా ఉండి, ఎమ్మెల్యే, అసమ్మతి నేతల చర్యల ఆధారంగా ముందుకు పోవాలని వేచిచూసే ధోరణిలో ఉన్నట్లు తెలుస్తోంది. అధికార పార్టీ నేతలు అవిశ్వాస తీర్మాణానికి పట్టుబడితే, మద్దతు తెలిపి ఎమ్మెల్యేను ఇరుకున పెట్టేందుకు సిద్ధంగా ఉన్నట్లు కాంగ్రెస్ నేతలు చెప్పుతున్నారు. సుల్తానాబాద్‌తో పాటు రామగుండం కార్పొరేషన్, పెద్దపల్లి, మంథని మున్సిపాలిటీల్లో అధికార పార్టీ కౌన్సిలర్లు, కార్పొరేటర్లు సైతం చైర్మన్లపై అసహనం వ్యక్తం చేస్తున్నారు. పెద్దపల్లి, మంథనిలో ఎమ్మెల్యే, జెడ్పీచైర్మన్ బంధువులే చైర్మన్‌గా ఉండటంతో లోలోపల చర్చలు జరుగుతున్నా బయటకుపొక్కటం లేదు.

పోటీపరీక్షల్లో నెగ్గి.. కొలువు సాధించాలి



స్వాగతం పలుకుతున్న ఎన్‌సీసీ కెడెట్లు

పెద్దపల్లిరూరల్: విద్యావంతులైన నిరుద్యోగ యువత పోటీపరీక్షల్లో ప్రతిభచూపి ఉద్యోగాలు సాధించి తమ భవిష్యత్తును చక్కగా తీర్చిదిద్దుకోవాలని అడిషనల్ కలెక్టర్ లక్ష్మినారాయణ అన్నారు. పెద్దపల్లి ప్రభుత్వ డిగ్రీకాలేజీలో గ్రూప్–2,3,4 ఉద్యోగాలు, పోటీపరీక్షలకు హాజరయ్యే అభ్యర్థులకు ఉచితంగాశిక్షణ ఇచ్చేందుకు ఏర్పాటు చేసినకేంద్రాన్ని గురువారం ప్రారంభించి మాట్లాడారు. ప్రభుత్వశాఖల్లో ఖాళీగా ఉన్న ఉద్యోగాలను భర్తీ చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. అర్హతలను బట్టి ఆయా ఉద్యోగాల కోసం పోటీపడే అభ్యర్థులకు అవసరమైన నైపుణ్యాన్ని అందించేందుకు షెడ్యూల్‌కులాల అభివృద్ధిసంస్థ ద్వారా ఉచితశిక్షణ శిబిరాన్ని నిర్వహిస్తున్నామని, దీనిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మే 8 వరకు ఈ శిక్షణ కొనసాగుతుందన్నారు. ప్రిన్సిపాల్ లక్ష్మనారాయణ, ఎన్‌సీసీ అధికారి కెప్టెన్ సంజీవ్, బీసీ వెల్ఫేర్ అధికారి రంగారెడ్డి, ఎస్సీవెల్ఫేర్ అధికారి నాగలేశ్వర్, ట్రేనర్ సదానందం ఉన్నారు.

క్లుప్తంగా

ఇండ్ల స్థలాలివ్వండి



మంత్రికి వినతిపత్రం ఇస్తున్న నాయకులు

పెద్దపల్లిరూరల్: దళిత,గిరిజన జర్నలిస్టులకు ఇంటిస్థలాలు ఇప్పించాలని ఎస్సీఎస్టీ వర్కింగ్ జర్నలిస్టుల అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు మల్లేశ్, వర్కింగ్ ప్రెసిడెంట్ బందెల రాజశేఖర్ కోరారు. గురువారం హైదరాబాద్‌లో మంత్రులు సత్యవతిరాథోడ్, కొప్పుల ఈశ్వర్, ప్రెస్‌అకాడమీ చైర్మన్ అల్లం నారాయణకు వినతిపత్రం అందించారు. సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకెళ్లి జర్నలిస్టులకు మేలు జరిగేలా చూడాలని కోరగా సానుకూలంగా స్పందించారని పేర్కొన్నారు.

కరాటే విజేతలకు అభినందన



అభినందిస్తున్న అడిషనల్ కలెక్టర్

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లికి చెందిన విద్యార్థులు జాతీయస్థాయి అండర్–12 కరాటే పోటీల్లో ప్రతిభను కనబర్చి విజేతలుగా నిలిచారు. ప్రథమస్థానంలో నిలిచిన జె.లోకేష్, రెండో స్థానంలో నిలిచిన కె.అమృతేశ్వర్‌లను అడిషనల్ కలెక్టర్ లక్ష్మీనారాయణ అభినందించారు. ప్రిన్సిపాల్ శైలజ, రామకృష్ణ, మాస్టర్ లక్ష్మీనర్సయ్య ఉన్నారు.

కార్మిక కుటుంబాలకు సదుపాయాలు కల్పించాలి



వినతిపత్రం ఇస్తున్న సత్తయ్య

గోదావరిఖని: సింగరేణి కార్మిక కుటుంబాలకు సదుపాయాలు కల్పించాలని బీఎంఎస్ అధ్యక్షుడు యాదగిరి సత్తయ్య డిమాండ్ చేశారు. గురువారం ఆర్జీ–1 డీజీఎం పర్సనల్ లక్ష్మీనారాయణను కలిసి వినతి పత్రం అందజేశారు. స్థానికస్టేడియంలో నెలరోజుల నుంచి నీటిసరఫరా లేక స్విమ్మింగ్ పూల్ నడవడంలేదన్నారు. తగిన ఏర్పాట్లు చేసి స్విమ్మింగ్ పూల్ నడిపేలా చర్యలు తీసుకోవాలన్నారు. స్టేడియంలో ప్రతిరోజు వాటర్‌స్ప్రే చేయాలన్నారు. వాకింగ్ ట్రాక్ ఏర్పాటు చేయాలన్నారు. నాయకులు వై.సారంగపాణి, ఆకుల హరీష్, సాయవేణి సతీశ్, మాదాసు రవీందర్, పోతరబోయిన విజయ్ కుమార్, ఆరెల్లి వెంకటరాజం పాల్గొన్నారు.

విద్యుత్‌స్తంభాన్ని ఢీకొని యువకుడి మృతి

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి మండలం గౌరెడ్డిపేట గ్రామానికి చెందిన మిట్టపల్లి సతీశ్(28) బైక్ అదుపుతప్పి విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టడంతో అక్కడికక్కడే మరణించాడు. సతీశ్ రైల్వే కాంట్రాక్టర్ వద్ద కొంతకాలంగా దినసరి కూలీగా చేస్తున్నాడు. పని ముగించుకుని గురువారం రాత్రి ఇంటికి వస్తుండగా బైక్ అదుపుతప్పి విద్యుత్‌స్తంభాన్ని ఢీకొంది. తీవ్రరక్తగాయాలైన సతీశ్ అక్కడికక్కడే మరణించాడు. సతీశ్‌కు ఇంకా వివాహం కాలేదు. ఇతడి మృతితో విషాదం నెలకొంది.

ఈసారి ఆలిండియా రెస్క్యూ పోటీలు ఇక్కడే

- పలు రాష్ట్రాలకు ఆతిథ్యం ఇవ్వనున్న సింగరేణి
- దేశవ్యాప్తంగా 26జట్లు పాల్గొనే అవకాశం
- దశాబ్దకాలం తర్వాత సింగరేణికి చాన్స్
- ప్రణాళికలు సిద్ధం చేస్తున్న సింగరేణి



మెయిన్ రెస్క్యూ స్టేషన్



పోటీల్లో తలపడుతున్న రెస్క్యూ బ్రిగేడియర్లు (ఫైల్)

గోదావరిఖని: దశాబ్దకాలం తర్వాత ఆలిండియా రెస్క్యూ పోటీలకు సింగరేణి ఆతిథ్యం ఇవ్వబోతోంది. ఈ పోటీలకు దేశవ్యాప్తంగా 19 బొగ్గుగనులు, 7 మెటల్ మైన్స్ హాజరయ్యే అవకాశం ఉంది. ఇందుకోసం సింగరేణి యాజమాన్యం ఇప్పటి నుండే కసరత్తు ప్రారంభించింది. నవంబర్ నెలలో పోటీలు ఉండే అవకాశం ఉన్నప్పటికి సింగరేణి ప్రతిష్టకు అనుగుణంగా నిర్వహించాలనే ఆలోచనలో యాజమాన్యం ఉంది. గతంలో మాదిరిగా ఈసారి కూడా ఆర్జీ–2 ఏరియా మెయిన్ రెస్క్యూస్టేషన్‌లో ఈపోటీలను నిర్వహించాలని సూత్రప్రాయంగా నిర్ణయించారు. పలు రాష్ట్రాల నుంచి వచ్చే రెస్క్యూ బ్రిగేడియర్లకు భోజన, వసతి సౌకర్యాలను కల్పించడంతో పాటు వారి ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేయాలనే యోచనలో యాజమాన్యం ఉంది. ప్రమాదాలు జరిగిన సమయంలో తాము న్నామంటూ కార్మికుల్లో ధైర్యం, భరోసా కల్పించే రెస్క్యూ విభాగం సంస్థకు ఎంతో కీలకం. అద్భుత ప్రతిభతో ఆలిండియా రెస్క్యూ పోటీల్లో సింగరేణి అద్భుతమైన సత్తా కనబర్చుతోంది. డబుల్ హాట్రిక్‌తో కోలిండియాలోనే సింగరేణి రెస్క్యూకు ప్రత్యేకత చాటుకుంది. 1994 నుంచి ఆలిండియా రెస్క్యూ పోటీల్లో పాల్గొంటున్న సింగరేణి గడిచిన 28ఏళ్లుగా ఎన్నో అవార్డులు, రివార్డులు తన సొంతం చేసుకుంది. అత్యాధునిక శిక్షణతో భూగర్భగనుల్లో ప్రమాదాలు జరిగినప్పుడు తామున్నామంటూ భరోసా నింపుతోంది. ఆలిండియా 51వ, రెస్క్యూ పోటీలు తిరిగి ఈనెల 14నుంచి 18వరకు రాజస్థాన్ రాష్ట్రంలోని ధరిభాలో హిందూస్థాన్ జింక్ లిమిటెడ్(హెచ్‌జెడ్ఎల్)లో జరిగాయి.

అన్ని పోటీలకు ప్రతిష్ఠాత్మకంగా ఏర్పాట్లు

ఆలిండియా రెస్క్యూ పోటీల్లో ఈసారి కూడా సింగరేణి సంస్థ నుండి రెండు జట్లు పాల్గొన్నాయి. పలుసార్లు ఆలిండియా రెస్క్యూ పోటీల్లో ఓవరాల్ చాంపియన్ కైవసం చేసుకుని సింగరేణి సత్తా చాటుతోంది. రెస్క్యూలో డ్రిల్‌అండ్‌పరేడ్, ఫస్ట్‌ఎయిడ్, స్టాట్యుటరీ, థియరీ, ఫ్రెష్‌ఎయిర్‌బేస్, రెస్క్యూఅండ్ రికవరీ, రెస్క్యూ రిలే రేస్ విభాగాల్లో పోటీలు జరగనున్నాయి. ఈపోటీల్లో ఆలిండియా వ్యాప్తంగా 19కోల్ మైన్స్ రెస్క్యూ జట్లు, 7మెటల్‌మైన్స్ రెస్క్యూ జట్లు పాల్గొననున్నాయి.

భారీ బడ్జెట్ కేటాయింపు..?

ఆలిండియా రెస్క్యూ పోటీలను ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు ప్రారంభమైయ్యాయి. మెయిన్ రెస్క్యూస్టేషన్‌తో పాటు భూగర్భ గనిలో ఈపోటీలను నిర్వహించాలని యోచిస్తున్నారు. దీనికోసం అన్ని రాష్ట్రాల నుండి వచ్చే జట్లకు ఆతిథ్యం కోసం, ఏర్పాట్ల నిర్వహణ కోసం సుమారు రూ. 80లక్షల మేర నిధులు కేటాయించనున్నట్లు తెలుస్తోంది.

ఫ్లాటర్ ప్రింటింగ్ మిషన్ ప్రారంభం



యంత్రాన్ని ప్రారంభిస్తున్న ప్రాజెక్టు అధికారి

గోదావరిఖని(రామగుండం): ఆర్జీ–2 ఏరియా వకీల్‌పల్లిగనిలో ఫ్లాటర్‌ప్రింటింగ్ యంత్రాన్ని ప్రాజెక్టు అధికారి శ్రీనివాస్‌రెడ్డి గురువారం ప్రారంభించారు. వకీల్‌పల్లి గని సర్వే డిపార్ట్‌మెంట్ కోసం డ్రాయింగ్ కెనాన్ ఫ్లాటర్ ప్రింటింగ్ మిషన్ రూ.3.6లక్షలతో కొనుగోలు చేశారు. తద్వారా పనిలో జాప్యం లేకుండా త్వరగా సర్వే డ్రాయింగ్ చేసే వీలుంటుందన్నారు. కార్యక్రమంలో గని మేనేజర్ రవికిరణ్, అఫ్సర్ పాషా, చంద్రశేఖర్, తిరుపతి, ఓంకారి బాబు, ఫణికుమార్ పాల్గొన్నారు.

జేఎన్టీయూ డీఈఈ బదిలీ

రామగిరి(మంథని): రామగిరి మండలం సెంటినరీకాలనీలోని జేఎన్టీయూ యూనివర్సిటీ ఆఫ్ ఇంజినీరింగ్ కళాశాల డీఈఈ రోళ్ల లక్ష్మణ్‌ను సుల్తాన్‌పూర్ జేఎన్టీయూ కళాశాలకు బదిలీ చేస్తూ యూనివర్సిటీ అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. 2017లో డీఈఈగా ఇక్కడ విధుల్లో చేరిన లక్ష్మణ్ సుదీర్ఘకాలం పాటు విధులు నిర్వహించారు. సుల్తాన్‌పూర్ జేఎన్టీయూ కళాశాలలో విధులు నిర్వహిస్తున్న డీపీఎస్ సతీశ్‌ను డీఈఈగా ఇక్కడికి బదిలీ చేస్తూ యూనివర్సిటీ నుంచి ఉత్తర్వులు వెలువడ్డాయి. సతీశ్ గతంలో కరీంనగర్ బిల్డింగ్ డివిజన్(కొండగట్టు, సెంటినరికాలనీ జేఎన్టీయూ కళాశాల)కు ఇన్‌చార్జి ఈఈగా విధులు నిర్వహించిన అనుభవం ఉంది.

అక్రమ అరెస్టులతో పోరాటాలను ఆపలేరు

- గీట్ల లక్ష్మారెడ్డి, కన్వీనర్, ఎన్టీపీసీ రామగుండం ఏరియా(సీఐటీయూ)

జ్యోతినగర్: సీఐటీయూ నాయకులను ముందస్తు అరెస్టులు చేయడంతో ప్రజా పోరాటాలను ఆపలేరని ఎన్టీపీసీ రామగుండం ఏరియా(సీఐటీయూ) కన్వీనర్ గీట్ల లక్ష్మారెడ్డి, సీఐటీయూ జిల్లా కోశాధికారి రామాచారి, జిల్లా కమిటీ సభ్యులు నాంసాని శంకర్‌లు గురువారం ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. పేద ప్రజల ఇండ్ల స్థలాల సాధనకోసం ప్రజాసంఘాల పోరాట వేదిక పిలుపు మేరకు చలో హైదరాబాద్‌కు బయలుదేరుతున్న క్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎరవెల్లి ముత్యంరావు, జిల్లా అధ్యక్షులు వేల్పుల కుమారస్వామి, వై.యాకయ్యలను అక్రమ అరెస్టులు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. తెలంగాణ ప్రభుత్వం ఏర్పడి తొమ్మిది సంవత్సరాలు గడుస్తున్నప్పటికీ ఇచ్చిన హామీలను నెరవేర్చాలని అడుగుతున్నందుకు అరెస్టు చేయడం దుర్మార్గం చర్య అన్నారు. ఉద్యమాలతో గద్దెనెక్కిన బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రజా పోరాటాలను అరెస్టులతో అడ్డుకుంటోందని అన్నారు.

ఆయిల్‌పాం సాగుతో అత్యధిక లాభాలు

ఓదెల(పెద్దపల్లి): ఆయిల్‌ఫాం సాగుతో అత్యధిక లాభాలు సాధించవచ్చునని జిల్లావ్యవసాయాధికారి ఆదిరెడ్డి పేర్కొన్నారు. గురువారం ఓదెల మండలం కొలనూర్ గ్రామంలో జంగ వెంకటరెడ్డి వ్యవసాయక్షేత్రంలో వ్యవసాయశాఖ, ఉద్యానవన శాఖ ఆధ్వర్యంలో ఆయిల్‌పాం సాగుపై అవగాహన సదస్సు నిర్వహించారు. డీఏవో మాట్లాడుతూ.. అంతర్జాతీయంగా ఆయిల్ ఉత్పత్తికి డిమాండ్ ఉండటంతో ప్రభుత్వం ముందుచూపుగా రైతులకు సబ్సిడీలో మొక్కలు, డ్రిప్‌లు పంపిణీ చేస్తోందని అన్నారు. వరి కన్నా ఆయిల్‌పాంతో అధిక లాభాలు పొందవచ్చని అన్నారు. ఓదెల జెడ్పీటీసీ గంట రాములు యాదవ్, సర్పంచు సామ మణెమ్మ, ఎంపీటీసీ కారెంగల శ్రీనివాస్, ఉపసర్పంచు పాకాల సంపత్‌రెడ్డి, సింగిల్‌విండో వైస్‌చైర్మన్ మద్దెల నర్సయ్య, జిల్లా ఉద్యానవనశాఖాధికారి జగన్మోహన్‌రెడ్డి, ఏఈవోలు స్వప్న, జ్యోతి, సీఈవో కేశుక ల్యాణ్‌కార్, కేవీకే శాస్త్రవేత్త భాస్కర్ రాంసార్, ఏడీఏ శ్రీనాథ్, ఏవో డి.నాగార్జున, రైతుసంఘం డైరెక్టర్ బండారి ఐలయ్యయాదవ్ పాల్గొన్నారు.

రైలు ఎక్కాలని.. పట్నం చూడాలని

- హైదరాబాద్ చూసేందుకు రైలులో వెళ్లిన బాలుడు
- ఇంటికి చేరిన తప్పిపోయిన విద్యార్థి కార్తికేయ



తల్లితో కార్తికేయ

పెద్దపల్లిరూరల్: ఊరికి సమీపంలో రైల్వేస్టేషన్ ఉంది.. కానీ ఎప్పుడూ రైలు ఎక్కలేదు. టీవీల్లో చాలాసార్లు హైదరాబాద్‌ను చూశాడు. కానీ ఎన్నడూ వెళ్లలేదు. ఏ ఊరు వెళ్లినా నాన్న ఎప్పుడూ బైక్‌పైనే తీసుకెళ్లేవాడు. ఎందుకో ఏమో.. ఈ బాలుడికి ఓసారి రైలెక్కి పట్నం వెళ్లాలనిపించింది. ఈనెల 7వ తేదీన స్నేహితులతో కలిసి పాఠశాలకని బయల్దేరిన పెద్దపల్లి మండలం గౌరెడ్డిపేటకు చెందిన కార్తికేయ అనే ఏడో తరగతి విద్యార్థి సాయంత్రం అయినా ఇంటికి చేరలేదు. చీకటి పడడంతో తల్లిదండ్రులు మురుగాని రాజేందర్, స్వప్న ఆందోళన చెందారు. బంధువులు, కార్తికేయ మిత్రుల వద్ద ఆరాతీసినా ఆచూకీ దొరకపోవడంతో పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు కార్తికేయ చదివే పాఠశాలకు సమీపంలోనే ఉన్న రైల్వేస్టేషన్‌లో సీసీ ఫుటేజీల్లో కనిపించాడు. పరిసరాల్లో గాలించగా ఆచూకీ లభించలేదు. మూడు రోజుల తరువాత గురువారం పెద్దపల్లి రైల్వేస్టేషన్‌లో దిగి ఇంటికి చేరాడు. తల్లి భావోద్వేగానికి లోనై ఆనందభాష్పాలు రాల్చింది. అయితే కార్తికేయ తాను రైలులో ప్రయాణించి హైదరాబాద్ చూడాలనే కోరికతో సికింద్రాబాద్ వరకు వెళ్లి తిరిగి కాగజ్‌నగర్ వైపు ప్రయాణించి వచ్చానని పేర్కొంటున్నాడు. తన కొడుకును ఎప్పుడూ రైలు ఎక్కించలేదని..హైదరాబాద్ లాంటి ప్రాంతాలకు తీసుకపోలేదని కార్తికేయ తండ్రి రాజేందర్ వివరించాడు. అత్తగారిల్లు ముస్త్యాలకు ఆటోలో.. ఏదైనా శుభకార్యాలు జరిగితే బైక్‌పైనే వెళ్లొచ్చేవారమని తెలిపాడు. ఏదేమైనా ఆ దేవుడి దయతో తమ కొడుకు తమచెంతకు చేరడం సంతోషంగా ఉందని భావోద్వేగంతో చెప్పాడు.

భక్తుల కొంగుబంగారం.. మల్లన్న ఆలయం

- కోనేరుతో పాటు పలు అభివృద్ధి పనులు ప్రారంభించిన ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి



కోనేరును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

ఓదెల(పెద్దపల్లి): భక్తులకు కొంగుబంగారం జిల్లాలోని ఓదెల మల్లన్న దివ్యక్షేత్రమని పెద్దపల్లి ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి కొనియాడారు. గురువారం ఓదెల మల్లికార్జునస్వామి దేవస్థానం ఆవరణలో వీరభద్రస్వామి, బంగారు, మదనపోశమ్మ ఆలయాలు, ఓదెల మల్లన్న సన్నిధిలో కోనేరును ప్రారంభించారు. విగ్రహప్రతిష్టపాన కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ స్వయంభుగా వెలిసిన ఓదెల మల్లికార్జునస్వామి భక్తులు కోరిన కోర్కెలు తీర్చే దేవుడిగా ప్రసిద్ధిగాంచాడని అన్నారు. సీజీఎఫ్ నిధులకింద రూ.36లక్షలతో ఓదెల మల్లికార్జునస్వామి దేవస్థానంలో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టినట్లు వివరించారు. ఓదెలమల్లన్న సన్నిధిలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టినందుకు దాతలను అభినందించారు. ఓదెల ఎంపీపీ కునారపు రేణుకదేవీ, ఆలయ చైర్మన్ మేకల మల్లేశంయాదవ్, జెడ్పీటీసీలు గంట రాములుయాదవ్, బొద్దుల లక్ష్మణ్, పొత్కపల్లి సింగిల్‌విండో చైర్మన్ ఆళ్ల శ్రీనివాస్‌రెడ్డి, బీఆర్ఎస్‌మండలశాఖ అధ్యక్షుడు ఐరెడ్డి వెంకటరెడ్డి, రైతుసమన్వయసమితి మండల చైర్మన్ కావటి రాజు, సర్పంచుల ఫోరం అధ్యక్షుడు ఆళ్ల రాజిరెడ్డి, ఈవో బొద్దు సదయ్య, పీఠాధిపతి శివానందచార్యులు, అర్చకులు వీరభద్రయ్య, భువనేశ్వరయ్య, మఠం భద్రయ్య పాల్గొన్నారు.

సీసీ కెమెరాల ఏర్పాటుపై అవగాహన పెంచాలి



పోలీసుస్టేషన్‌ను పరిశీలిస్తున్న డీసీపీ వైభవ్

మంథని: నేరాల నియంత్రణకు సీసీ కెమెరాలు ఎంతగానో దోహదపడతాయని, వీటి ఏర్పాటుపై ప్రజల్లో అవగాహన పెంచాలని పెద్దపల్లి డీసీపీ వైభవ్ గైక్వాడ్ సూచించారు. గురువారం మంథని పోలీస్‌స్టేషన్‌ను తనిఖీ చేశారు. క్రమశిక్షణగా విధులు నిర్వర్తిస్తూ ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని సూచించారు. ప్రజలనుంచి వచ్చే ఫిర్యాదులపై తక్షణమే స్పందించి బాధితులకు న్యాయం చేయాలని పేర్కొన్నారు. సిబ్బంది పనితీరు, కేసుల వివరాలను పరిశీలించారు. పోలీస్‌స్టేషన్ పరిధిలో సీసీ కెమెరాల పనితీరు, నేరాల నియంత్రణ, రోడ్డు ప్రమాదాల గురించి తీసుకుంటున్న చర్యలపై ఆరా తీశారు. గోదావరిఖని ఏసీపీ గిరిప్రసాద్, సీఐ సతీశ్, ఎస్సైలు వెంకటేశ్వర్లు, రాణివర్మ, సిబ్బంది పాల్గొన్నారు.

గురుకుల విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేకశ్రద్ధ



మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో ప్రమోద్‌కుమార్

పెద్దపల్లిరూరల్: జిల్లాలోని రెసిడెన్షియల్ పాఠశాలల్లో ఉంటూ చదువుకునే విద్యార్థుల ఆరోగ్యం విషయంలో వైద్యసిబ్బంది, కేర్‌టేకర్స్, వార్డెన్లు అప్రమత్తంగా ఉంటూ ప్రత్యేకశ్రద్ధ చూపాలని జిల్లా వైద్యాధికారి ప్రమోద్‌కుమార్ అన్నారు. రంగంపల్లిలోని మైనార్టీ గురుకుల కాలేజీలో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో బీసీ, మైనార్టీ సంక్షేమశాఖ జిల్లా అధికారులు రంగారెడ్డి, మెహరాజ్‌తో కలిసి పాల్గొని మాట్లాడారు. విద్యార్థులు అనారోగ్యానికి గురైతే అందుకు గల కారణాలను తెలుసుకుని వైద్యసేవలందించాలని సూచించారు. విద్యార్థులు వ్యక్తిగత పరిశుభ్రత పాటించేలా చూడడంతో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని వార్డెన్లకు సూచించారు. విజయపాల్‌రెడ్డి, మహేందర్, సుజాత, డోరకమ్మ, వెంకటేశ్వర్లు, మధుసూదన్ ఉన్నారు.

సింగరేణిని ముంచుతున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు

- ఐఎన్‌టీయూసీ జనరల్ సెక్రెటరీ జనక్ ప్రసాద్



మాట్లాడుతున్న జనక్ ప్రసాద్

యైటింక్లయిన్‌కాలనీ: సింగరేణి సంస్థను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ముంచుతున్నాయని ఐఎన్‌టీయూసీ జనరల్ సెక్రెటరీ జనక్ ప్రసాద్ అన్నారు. గురువారం ఆర్జీ–2 ఏరియా యైటింక్లయిన్‌కాలనీ ప్రెస్‌భవన్‌లో మాట్లాడుతూ.. వివిధ ఫండ్‌ల రూపంలో కేంద్రానికి, రాష్ట్రానికి వేలకోట్ల రూపాయలను సింగరేణి సంస్థ చెల్లిస్తోందని పేర్కొన్నారు. లాభాలు గడిస్తున్న సింగరేణిని మోదీ ప్రభుత్వం ఎందుకు ప్రయివేటుపరం చేసేందుకు ప్రయత్నం చేస్తోందని ప్రశ్నించారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం బొగ్గు గనుల వేలాన్ని అడ్డుకునే శక్తి ఉన్నా ఎందుకు అడ్డుకోవడం లేదన్నారు. ఓ వైపు విద్యుత్, మరోవైపు బొగ్గు గనులను బడా పెట్టుబడిదారులకు అప్పగించడానికి ప్రయత్నిస్తే దేశంలో, రాష్ట్రంలో చిన్న పరిశ్రమల మనుగడ లేకుండా పోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రజావ్యతిరేక విధానాలు మానుకోవాలని కోరారు. నాయకులు నర్సింహరెడ్డి, ధర్మపురి, ఎస్‌కే అక్బర్ ఆలీ, దాస్, మనోహర్, సత్యనారాయణ, మార్కండేయ, సదానందం ఉన్నారు.

రైళ్లలో దోపిడీలకు పాల్పడే వ్యక్తి అరెస్టు



నగలు చూపుతున్న పోలీసులు

రామగుండం: ప్యాసింజర్ రైళ్లలో వృద్ధ దంపతులు లక్ష్యంగా చోరీలకు పాల్పడుతున్న ఓ దొంగను గురువారం రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్(ఆర్పీఎఫ్) పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఆర్పీఎఫ్ సీఐ బుర్ర సురేశ్‌గౌడ్ వివరాల మేరకు జయశంకర్ భూపాలపల్లి జిల్లా మొగుళ్లపల్లి మండలం మొట్లపల్లి గ్రామానికి చెందిన మిరుపురి రాజు(35) కొంతకాలంగా ప్యాసింజర్ రైళ్లలో వృద్ధ దంపతులు లక్ష్యంగా వారిని మాటల్లో పెట్టి మత్తు పదార్థాలు ఇచ్చి దోపిడీకి పాల్పడుతున్నాడు. దోచిన బంగారాన్ని ఓ ప్రయివేటు ఫైనాన్స్ కంపెనీలలో తాకట్టు పెట్టి రుణం పొందుతున్నాడు. అతని వద్ద నుంచి 30గ్రాముల బంగారం రికవరీచేసి, అరెస్టు చేసి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు. కాగా నిందితుడిని అదుపులోకి తీసుకోవడంలో చాకచక్యంగా వ్యవహరించిన ఆర్పీఎఫ్ ఏఎస్సై మల్లేశ్వరయ్య, కానిస్టేబుల్ ఆర్ఏ.మీనా, జీఆర్పీ కానిస్టేబుల్ రాజులను ఆర్పీఎఫ్ సీఐ సురేష్‌గౌడ్ అభినందించారు.

'ఖని'లో రెండిళ్లలో చోరీ

గోదావరిఖని: స్థానిక తిలక్‌నగర్‌లోని రెండిళ్లలో చోరీ జరిగింది. భారీగా సొత్తు ఎత్తుకెళ్లారు. గురువారం మధ్యాహ్నం సమయంలో గొట్టి రవీందర్‌రెడ్డి క్వార్టర్‌లో దొంగలు పడి 18తులాల బంగారం, రూ.1.60లక్షల నగదు ఎత్తుకెళ్లారు. అలాగే క్వార్టర్ సమీపంలో బోగె రాములుకు చెందిన మరో క్వార్టర్‌లో రూ.8వేల నగదు ఎత్తుకెళ్లారు.

విద్యుత్‌షాక్‌తో రైతు మృతి



సంఘటన స్థలం వద్ద రామారావు మృతదేహం

తిమ్మాపూర్: నుస్తులాపూర్ గ్రామంలో ఓ రైతు విద్యుత్‌షాక్‌తో మృతిచెందాడు. ఎల్ఎండీ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన రైతు తుమ్మనపల్లి రామారావు(70) గురువారం ఉదయం పొలంలో నాటు వేయించేందుకు కూలీలను తీసుకొని గ్రామ శివారులో ఉన్న మైసమ్మ మర్రి వద్దకు వెళ్లాడు. కూలీలు నాట్లు వేస్తుండగా మోటార్ ఆన్ చేసేందుకు బావి వద్దకు వెళ్లాడు. మోటార్ ఆన్‌చేసినా పనిచేయకపోవడంతో దానిని సరిచేసేందుకు యత్నించాడు. ఈ క్రమంలో షాక్‌కు గురై అక్కడికక్కడే మృతిచెందాడు. గమనించిన సిరికొండ అంజన్ రావు వెంటనే కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చాడు. వెళ్లి పరిశీలించగా అప్పటికే చనిపోయాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

లారీ.. బైక్ ఢీకొని ఒకరి మృతి

పెద్దపల్లిరూరల్: దంపతులు ప్రయాణిస్తున్న బైక్‌ను లారీ ఢీకొంది. ఈ ఘటనలో భర్త కుమ్మరి రమేశ్(40) మరణించాడు. అతని భార్య స్వరూప గాయాలపాలై చికిత్స పొందుతోంది. ఈ ఘటన గురువారం పెద్దపల్లి–మంథని ఫ్లైఓవర్ బ్రిడ్జి వద్ద చోటు చేసుకుంది. ఎస్సై రాజేశ్ వివరాల ప్రకారం పెద్దపల్లి మండలం రాఘవాపూర్ పంచాయతీ పరిధిలోని గొల్లపల్లికి చెందిన కుమ్మరి రమేశ్, స్వరూప దినసరి కూలీలు. బైక్‌పై పనికి బయలుదేరిన దంపతులను వెనక నుంచి వచ్చిన లారీ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో రమేశ్, స్వరూపకుకు తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు వీరిని పెద్దపల్లి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం రమేశ్‌ను వరంగల్ ఎంజీఎంకు తరలిస్తుండగా మార్గమధ్యంలో మరణించాడని ఎస్సై పేర్కొన్నారు. స్వరూప స్థానిక ఆసుపత్రిలో చికిత్స పొందుతోంది. వీరికి సింధుజ అనే కుమార్తె ఉంది. మృతుడి సోదరుడు కనకరాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

ఎన్టీపీసీ రామగుండం ప్రాజెక్టు లెవల్ ప్రొఫెషనల్ సర్కిల్ విజేత 'రసాయన్'



విజేత బృందంతో అధికారులు

జ్యోతినగర్: ఎన్టీపీసీ రామగుండం 22వ ప్రాజెక్టు లెవల్ ప్రొఫెషనల్ సర్కిల్స్ సదస్సు–2023లో రసాయన్ సర్కిల్ జట్టు విజేతగా నిలిచింది. గురువారం ఎన్టీపీసీ టీటీఎస్ ఉద్యోగ వికాసకేంద్రం ఆడిటోరియంలో జరిగిన 22వ ప్రాజెక్టు లెవల్ ప్రొఫెషనల్ సర్కిల్స్ సదస్సును జనరల్ మేనేజర్ అతుల్‌కుమార్ దేశాయ్ జ్యోతిప్రజ్వలన చేసి ప్రారంభించారు. పోటీలలో 24 జట్లు పాల్గొన్నాయి. ప్రథమ స్థానంలో రసాయన్, ద్వితీయ స్థానంలో ఇంపీరియల్, తృతీయ స్థానంలో సంకల్ప్ జట్లు విజేతలుగా నిలిచాయి. విజేతలకు జనరల్ మేనేజర్ల బృందం ప్రశంసాపత్రాలను అందించారు. జనరల్ మేనేజర్లు పుష్పేంద్రకుమార్ లాఢ్, అనిల్‌కుమార్ వేముల, మోహన్‌రెడ్డి, తపస్ ఉన్నారు.



సాక్షి క్లాసిఫైడ్స్

REAL ESTATE

PLOT FOR SALE

1) Iconic Infra(Hyd) సాగర్ హైవే ఫేసింగ్ యాచారం DTCP ప్లాట్లు Nr. ఫార్మాసిటీ & 85ఎ।। HMDA లేఅవుట్ విజయవాడ హైవే@ చౌటుప్పల్ RRR ప్రక్కన 9154102338 [HA-10737]

SERVICES

ఆధార్‌కార్డ్, పాన్‌కార్డ్, కలిగి స్వంత ఇల్లు ఉన్న ప్రతి ఒక్కరికి 1 లక్ష నుండి 10 లక్షల వరకు ఋణాలు ఇవ్వబడును. సంప్ర: 9014653011, 9391225462 [H-793602]

వ్యక్తిగత, వ్యాపారం, వ్యవసాయ ఆస్తి, టేక్‌ఓవర్ లోన్, NPA కేసులు తక్కువ సిబిల్ స్కోర్ కూడా ఋణానికి వర్తిస్తాయి. సంప్రదించండి: 9463846068. [T-1745]



For Classifieds, Advertisements Contact:
9951602933
9951602824

సర్టిఫికేట్స్ పోయినవి

సరళ సాహితి D/o దయాకర్, వృత్తి: ప్రైవేట్ ఉద్యోగి, ఇ.నెం. 8-3-236, భగత్‌నగర్, కరీంనగర్. సుభాష్ నగర్ నుండి మంచిర్యాల చౌరస్తాకు వెళ్లే దారిలో నాయొక్క GNM నర్సింగ్ & డిప్లొమా సర్టిఫికేట్స్ పోయినవి. దొరికినవారు పై అడ్రస్‌లో సంప్రదించగలరు. సెల్: 9014031454 [K-1232931]

WANTED

ప్రముఖ సంస్థ నందు మీ ఇంటి దగ్గర ఉంటూ పార్ట్‌టైం/ఫుల్‌టైం పోస్టల్ కవర్లపై అడ్రస్‌లు వ్రాయుటకు స్త్రీ/పురుషులు కావలెను. నెలకు 10–15వేలు వరకు సంపాదన. ఫ్రీ బుక్‌లెట్ కొరకు 9059509586 [G-779895]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.